కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.15, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 38, పందిరి బీర 13, క్యాబేజీ 13, క్యారెట్ 28, దొండ 23, గుండుబీన్స్ 90, గింజ చిక్కుడు 65, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 16, ఆలుగడ్డ 24, చామగడ్డ 35, మొరంగడ్డ 23, కందగడ్డ 55, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

న్యూట్రిషన్ పీజీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

లాలాపేట: ఐసీఎంఆర్–నేషనల్ న్యూట్రిషన్ 2025–27 సంవత్సరానికిగాను ఎమ్మెస్సీ అప్లయిడ్ న్యూట్రిషన్, ఎమ్మెస్సీ స్పోర్ట్స్ న్యూట్రిషన్ కోర్సుల్లో ప్రవేశానికి ఆల్ ఇండియా ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఐఎన్ అధికారులు నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించడానికి జూన్ 5 చివరి తేది. దేశ వ్యాప్తంగా హైదరాబాద్, విశాఖపట్టణం, న్యూ ఢిల్లీ, ముంబయి, కోల్‌కత్తా బెంగుళూరు, చెన్నై ఏడు వేరు వేరు కేంద్రాంలో ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్ష నిర్వహించబడుతుందన్నారు. వివరాలకు 98489 56136, 040–27197247 నెంబర్లకు ఫోన్ చేయవచ్చు.

అందుబాటులో బస్తీ దవాఖానా వైద్య సేవలు



ఇందిరానగర్ బస్తీ దవాఖానాలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ ఇందిరానగర్‌లోని బస్తీ దవాఖాన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. కొద్ది నెలలుగా ఇక్కడ డాక్టర్ లేకపోవడంతో పిల్లలు, మహిళలతో పాటు సాధారణ వైద్య సేవలు అందుబాటులో లేకుండాపోయాయి. డాక్టర్ సృజల మిట్టపల్లి అనే వైద్యురాలిని ఇందిరానగర్ బస్తీ దవాఖానకు నియమించారు. దీంతో మళ్లీ ఇక్కడి బస్తీ దవాఖానలో వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. గర్భిణీలు, తల్లులు, పిల్లలకు అన్ని విధాల వైద్య సేవలను బస్తీ దవాఖానలో అందిస్తున్నామని డాక్టర్ సృజల తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కృషి

లాలాపేట: తార్నాక డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బండారి ఉపేందర్ యాదవ్ బుధవారం బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షులు భరత్‌గౌడ్‌ను కలిశారు. డివిజన్ పరిధిలో బీజేపీ కార్యవర్గం ఎన్నిక వివరాలతో కూడిన జాబితాను అందజేశారు. డివిజన్ స్థాయిలో పార్టీ బలోపేతం కోసం కృషిచేస్తున్నామని వివరించారు.

కుటుంబ సభ్యులతో వచ్చి వైన్‌షాప్‌పై దాడి

అడ్డగుట్ట: వైన్‌షాప్ సిబ్బందిపై దాడి చేసి షాపులోని బాటిళ్లు, ఇతర సామాగ్రిని ధ్వంసం చేసిన నలుగురిపై కేసు నమోదైంది. లాలాగూడ పోలీసులు తెలిపిన మేరకు..లాలాపేట ప్రాంతానికి చెందిన శ్రీనివాస్ సోమవారం సాయంత్రం లాలాపేటలోని మల్లికార్జున్ వైన్స్‌లో తన స్నేహితులతో కలిసి మద్యంతాగి వైన్స్ సిబ్బందితో గొడవ పడి వెళ్లిపోయాడు. కొద్ది సేపటికి తన కుటుంబసభ్యులను తీసుకొచ్చి వైన్స్ షాపులోకి చొరబడి యజమాని వెంకటేష్‌పై దాడి చేయడమే కాకుండా ఐదు కేసుల బీరు బాటిళ్లు, టిన్స్‌తో పాటు షాపులోని సామాగ్రిని ధ్వంసం చేశారు. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న లాలాగూడ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం



దివ్యశ్రీ (ఫైల్)

సికింద్రాబాద్: చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన మేరకు.. దివ్యశ్రీ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ మెట్టుగూడలో నివసిస్తుంది. ఈనెల 25న తాను ఉద్యోగం చేస్తున్న కార్యాలయానికి వెళుతున్నానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు.కుటుంబసభ్యులు వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యార్థుల సురక్షిత రవాణాపై నేడు సమావేశం

హిమాయత్‌నగర్: పాఠశాలల పిల్లల సురక్షిత రవాణా కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తగు చర్యలపై ఈ నెల 29(నేడు) ఖైరతాబాద్ క్రాస్ రోడ్స్‌లోని విశ్వేశ్వరయ్య భవన్(ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్)లో అవగాహన నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్(ఫౌండర్స్ ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎన్.రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.అనిల్ కుమార్, కోశాధికారి కే.శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే సమావేశానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రవాణా శాఖ కమిషనర్ సురేంద్రమోహన్ హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా తగు సూచనలు చేయనున్నట్లు వారు వెల్లడించారు.

ఫ్లై ఓవర్‌ను పట్టించుకోరా?

ఫతేనగర్ సంఘటనతోనైనా అధికారులు మేల్కొనేరా..?



శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్న ఫ్లైఓవర్ మెట్ల మార్గం..



ఫతేనగర్ ఫ్లైఓవర్ పిల్లర్స్‌కు ఏపుగా పెరిగిన మొక్కలు

సనత్‌నగర్: ఫ్లైఓవర్ల నిర్వహణను గాలికొదిలేశారు. అసలు వాటి ప్రస్తుత పరిస్థితి ఏమిటీ..? వాటి సామర్థ్యం ఎలా ఉంది..? అని ఎప్పటికప్పుడు పరిశీలించాల్సిన అధికార యంత్రాంగం అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. దశాబ్దాల క్రితం నిర్మించిన ఫ్లైఓవర్లకు పగుళ్లు ఏర్పడి ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనన్న ఆందోళన నెలకొంటోంది. సోమవారం ఫతేనగర్ బ్రిడ్జి మెట్లు కూలిపోవడమే ఇందుకు తార్కాణం. పునరుద్ధరణ మాట అలా ఉంచితే..కనీసం మరమ్మతులు చేద్దామన్న ఆలోచన కూడా లేకపోవడం గమనార్హం. ఫతేనగర్, బేగంపేట ఫ్లైఓవర్లను చూస్తే అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. నిర్మాణం జరిగి మూడు దశాబ్దాలు పైబడగా తరచూ వాటిని పరిశీలిస్తూ అవి ఏ స్థితిలో ఉన్నాయో పరీక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ వాటి పర్యవేక్షణ చూసే ఆర్ అండ్ బీ అధికారులకు అంత తీరిక ఉండడం లేదా? లేక ఆ..చూద్దాంలే అన్న నిర్లక్ష్య ధోరణా! అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫతేనగర్ బ్రిడ్జి మెట్లు కూలిపోయిన ఘటనలో అదృష్టవశాత్తూ ప్రాణాపాయం జరగకపోయినా ఓ వ్యక్తి రెండు కాళ్లు విరిగిపోయాయి. ప్రాణాలు పోతే గానీ అధికారుల్లో చలనం ఉండదా? అన్న ఘాటైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

- ఫతేనగర్ ఫ్లైఓవర్ నిర్మించి దాదాపు మూడున్నర దశాబ్దాలైంది. 1990 ప్రాంతంలో ఈ ఫ్లైఓవర్ నిర్మాణం జరిగింది. ఆర్ అండ్ బీ నిర్వహణలో కొనసాగుతున్న ఈ బ్రిడ్జి నిర్వహణను గాలికొదిలేసినట్లు తెలుస్తోంది. అక్కడక్కడ ఫ్లైఓవర్ పెచ్చులూడడం, ఫ్లైఓవర్‌కు మొక్కలు చెట్లుగా పెరుగుతండడంతో పగుళ్లు ఏర్పడుతూ వస్తున్నాయి. గతంలో ఫ్లైఓవర్ నిర్వహణ తీరుపై 'సాక్షి' ప్రత్యేక కథనం ద్వారా వెలుగులోకి తీసుకువచ్చింది. ఫ్లైఓవర్ సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు పరీక్షించాల్సిన అధికారులు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

విస్తరణకు నిధులు మంజూరైనా..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న ఫ్లైఓవర్‌ను విస్తరించాలనే ప్రతిపాదనతో పాటు రూ. 5 కోట్ల మేర నిధులు కూడా మంజూరు చేసింది. ఇందుకోసం రైల్వే శాఖ నుంచి గ్రీన్‌సిగ్నల్ కూడా వచ్చింది. అప్పటి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన కూడా చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదు. పనులు ప్రారంభించి ఉంటే మెట్లు కూలిపోయే పరిస్థితి ఉండేది కాదని స్థానికులు పేర్కొంటున్నారు.

బేగంపేట ఫ్లైఓవర్ పరిస్థితీ అంతే..!

అటు పంజగుట్ట–సికింద్రాబాద్ మార్గంలోని గ్రీన్‌ల్యాండ్స్ నుంచి బేగంపేట కట్టమైసమ్మ వరకు ఉన్న ఫ్లైఓవర్ నిర్వహణ తీరు కూడా అంతంతమాత్రంగానే ఉంది. ఈ ఫ్లైఓవర్‌కు కూడా చెట్లు ఏపుగా పెరిగిపోయి అక్కడక్కడ పగుళ్లు ఏర్పడ్డాయి. నానిపోయి పెచ్చులూడి వస్తున్నాయి. ఈ ఫ్లైఓవర్‌ను చూస్తే లెక్కకుమిక్కిలి కేబుళ్ల వైర్లతో ప్రమాదకరంగా ఉంది.



బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ ఫ్లైఓవర్ పరిస్థితి ఇదీ..

ఆలయ నూతన కమిటీ నియామకం



ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కలిసిన గణేష్ టెంపుల్ చైర్మన్ ప్రభాకర్ యాదవ్ తదితరులు

రసూల్‌పురా: సికింద్రాబాద్ గణేష్ ఆలయం నూతన కమిటీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయ కమిటీ చైర్మన్‌గా రెజిమెంటల్ బజార్‌కు చెందిన ప్రభాకర్ యాదవ్, ట్రస్టు సభ్యులుగా తుమ్మల నరేందర్ యాదవ్, జాజుల ఆంజనేయులు, ఎన్. మల్లేష్, వి. సంతోష్, శ్రీరాం సాయికుమార్, బట్టు బిక్షపతి, నందికంటి నాగమణి, ఎన్. నరేందర్. ఎన్. వేణుగోపాల చారి, అనిల్ యాదవ్, నిమ్మ వందన, పి. మాణిక్య ప్రభు, వంగ నరేష్ తదితరులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా సభ్యులు ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు.

31న టీజేఎఫ్ రజతోత్సవ సభ

బొల్లారం: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ముందుండి పోరాడిన తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం (టీజేఎఫ్) రజతోత్సవ సభ ఈ నెల 31న జల విహార్‌లో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్ పిలుపునిచ్చారు. తిరుమలగిరిలోని జయలక్ష్మి గార్డెన్లో బుధవారం సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. యూనియన్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని ఆయన వివరించారు.

ప్రజలను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటాం

ఏసీపీ శశాంక్‌రెడ్డి



పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శశాంక్‌రెడ్డి

సికింద్రాబాద్: ప్రజలకు ఇబ్బంది కలిగించే వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, వారిపై కేసులు నమోదు చేస్తామని చిలకలగూడ ఏసీపీ కే.శశాంక్ రెడ్డి హెచ్చరించారు. చిలకలగూడ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన బుధవారం తన కార్యాలయంలో వారాసీగూడ, చిలకలగూడ, లాలాగూడ పోలీస్‌స్టేషన్లకు చెందిన పీస్ కమిటీ ప్రతినిధులతో శశాంక్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పౌరులు అందరు పోలీసు నిబంధనలకు లోబడి వ్యవహించాలని చెప్పారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే విధంగా ఎవరూ ప్రవర్తించకూడని చెప్పారు. సోషల్ మీడియాల్లో వచ్చే వాస్తవ దూరమైన వార్తలను ఇతరులకు పోస్ట్ చేయకూడదని, ఓటీపీ నెంబర్లు, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతాల వివరాలు ఇతరులకు అందించి మోసపోవద్దని ఏసీపీ కోరారు. ఇటువంటి ఉదంతాలు ఎదురైన సందర్భాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన 8712661155 మొబైల్ నెంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్లు ఏ.మధుసూదన్‌రెడ్డి, బి.అనుదీప్, రఘు పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ సంఘ్ ప్యానల్ విజయం



సభ్యులను సత్కరిస్తున్న ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు

అడ్డగుట్ట: సౌత్ లాలాగూడలోని రైల్వే సీనియర్ ఇన్‌స్టిట్యూట్ మేనేజింగ్ కమిటీ ఎన్నికల్లో ఎంప్లాయీస్ సంఘ్ ప్యానల్ విజయం సాధించింది. బుధవారం లాలాగూడలోని వర్క్‌షాప్‌లో సంబరాలు జరుపుకున్నారు. దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ప్యానల్, మజ్దూర్ ప్యానల్, ఇండిపెండెంట్ ప్యానళ్ల మధ్య జరిగిన పోటీలో సంఘ్ ప్యానల్ ఐదు పదవులను దక్కించుకుంది. కోశాధికారిగా రాజేశ్వర్‌తో పాటు నలుగురు వర్కింగ్ కమిటీ సభ్యులుగా నాగరాజ్, సంతోష్‌కుమార్, కేశవరం లక్ష్మణ్, దేవి ప్రసాద్‌లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘ్ నాయకులు ఎంజి. అరుణ్ కుమార్, ఆదం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటి కాలువకు మరమ్మతులు చేయాలి

అడ్డగుట్ట: డివిజన్‌లో ఉన్నటువంటి వర్షపు నీటి కాలువకు మరమ్మతులు చేయాలని సీపీఎం సికింద్రాబాద్ కన్వీనర్ అజయ్‌బాబు కోరారు. బుధవారం ఆయన పలువురు పార్టీ నేతలు, స్థానికులతో కలిసి సదరు కాలువను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని సుధాకర్ హాస్పటల్ సమీపంలో ఉన్నటువంటి వర్షం నీటి కాలువకు తగిన మరమ్మతులు చేయాలన్నారు. కార్యక్రమంలో బస్తీవాసులు ఫాతిమా, లక్ష్మీబాయి, శ్రీనివాస్, మాధవి, అంజమ్మ, ఎల్లయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



వర్షపునీటి కాలువకు మరమ్మతులు చేయాలని కోరుతున్న స్థానికులు

చెక్‌పోస్ట్‌ను పరిశీలించిన అదనపు డీసీపీ



చెక్‌పోస్ట్‌ను సందర్శించిన ఈస్ట్‌జోన్ అదనపు డీసీపీ నర్సయ్య

అడ్డగుట్ట: లాలాగూడ పీఎస్ పరిధిలోని మిర్జాల్‌గూడ టీ జంక్షన్, ఇసుక బావి ప్రాంతాల వద్ద ఏర్పాటు చేసిన ఇంటర్ కమీషనరేట్ చెక్‌పోస్టలను ఈస్ట్‌జోన్ అదనపు డీసీపీ నర్సయ్య బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జంతువుల అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు ఈ చెక్‌పోస్టులు దోహదపడుతాయన్నారు. లాలాగూడ ఇన్‌స్పెక్టర్ రఘు బాబు, ఎస్‌ఐ షాహీద్ పాషాలు ఉన్నారు.

టన్నుల కొద్దీ డెబ్రిస్ తొలగింపు



ప్రభుత్వ పాఠశాల ముందు పేరుకుపోయిన డెబ్రిస్‌ను తొలగిస్తున్న దృశ్యం

సనత్‌నగర్: బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ ప్రభుత్వ పాఠశాలల ముందు ఎన్నో నెలలుగా పేరుకుపోయిన డెబ్రీస్, మట్టి, ఇతరత్రా వ్యర్థాలను బుధవారం జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బంది తొలగించారు. కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ అధికారులతో కలిసి మంగళవారం స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ క్రమంలో పాఠశాల ముందు వ్యర్థాలు, మట్టి కుప్పలతో స్థానికులతో పాటు పాఠశాలకు వచ్చే విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఇబ్బందులుపడుతున్నట్లు పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఈ ప్రాంతంలోని డెబ్రీస్ తొలగింపునకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరగా బుధవారం ఉదయం టన్నుల కొద్ది డెబ్రీస్‌ను తొలగించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు.

మాదకద్రవ్యాల బారి నుంచి యువతను కాపాడాలి

అడ్డగుట్ట: మద్యం, మాదకద్రవ్యాల బారి నుంచి పిల్లలు, యువతను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి అన్నారు. బుధవారం సాయంత్రం తుకారాంగేట్ నుంచి అడ్డగుట్ట చౌరస్తా వరకు అవగాహన ర్యాలీ నిర్వహించి అనంతరం, తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ.. మాంగర్ బస్తి, తుకారం గేట్, అడ్డగుట్ట, మొండి బండ నగర్, ఆజాద్ చంద్రశేఖర్ నగర్, పిట్టల బస్తీ, రవీంద్ర నగర్ తదితర ప్రాతాల్లో మద్యం, గంజాయి, బీడీలు సిగరెట్లు, గుట్కా వంటివి విక్రయి వంటివి విరివిగా విక్రయిస్తున్నారన్నారు. దీనివల్ల పిల్లలు, యువకులు వీటికి అలవాటు పడుతున్నారన్నారు.ర్యాలీలో లింగాని శ్రీను, నక్క మధు, భాగ్యలక్ష్మి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



తుకారాంగేట్‌లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భారీ చెట్టు తరలింపు



లోతుకుంట జంక్షన్ నుండి తరలిస్తున్న దృశ్యం

బొల్లారం: తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లోతుకుంట వై జంక్షన్ వద్ద ఉన్న ఓ భారీ చెట్టును ఆల్వాల్ ఐటీఐ కాలేజ్ కాంపస్‌కు జాగ్రత్తగా తరలించారు. ట్రాఫిక్ సమస్యకు ప్రధాన అడ్డంకిగా మారడంతో చెట్టును మరోచోటికి తరలించారు. చెట్టు ఊడలు, కొమ్మలు వేలాడటం వల్ల ప్రయాణికులు ప్రమాదాల బారినపడుతున్నారు. ముఖ్యంగా యూ–టర్న్ తీసుకోవడానికి వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడేవారు. అధికారుల అనుమతితో చెట్టును తరలించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు.



చెట్టును అధికారుల సమక్షంలో ఆల్వాల్ ఐటీఐకి జాగ్రత్తగా తరలించిన దృశ్యం

భూకబ్జాదారుడిపై కేసు

బంజారాహిల్స్: ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తిపై షేక్‌పేట మండల తహసీల్దార్ వై.అనితా రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–14లోని ప్రభుత్వ స్థలంలో బ్లూ షీట్స్ ఏర్పాటు చేసిన అధికారులు ప్రభుత్వ స్థలమని హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటుచేశారు. అయితే షేక్ మహ్మద్ జహంగీర్ అనే వ్యక్తి ప్రభుత్వ హెచ్చరిక బోర్డును తొలగించి సదరు స్థలం తనదిగా పేర్కొంటూ పోస్టర్లు అంటించాడు. సమాచారం అందుకున్న షేక్‌పేట రెవెన్యూ అధికారులు నిందితుడిపై ఫిర్యాదు చేశారు.

పార్కు రోడ్డుకు మోక్షమెప్పుడో..?

శంకుస్థాపన చేశారు.. పనులు మరిచారు

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్ పార్కు పక్కన రోడ్డు పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. రోడ్డుకు నిధులు మంజూరైనా పనులు మాత్రం ఆగిపోయాయి. గతుకులమయంగా మారిన ఈ రోడ్డు పై రాకపోకలు సాగించేవారు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ముఖ్యంగా పార్కుకు వచ్చే వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక వర్షం వస్తే ఈ రహదారి చిన్నపాటి చెరువును తలపిస్తుంది. ఈ రోడ్డు పనుల శంకుస్థాపన కార్యక్రమంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు పోటీ పడ్డారు. పనులు చేయించడంతో ఇరు పార్టీల నాయకులు విఫలమయ్యారనే విమర్శలు విన్పిస్తున్నాయి. పనుల ప్రారంభోత్సవ సమయంలో కాంగ్రెస్ నాయకురాలు డాక్టర్ కోటనీలిమ తన అనుచరులతో కలిసి రాగా, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు తీవ్రంగా పోటీ పడి హంగామా చేశారు. రూ. 12.5లక్షల వీడీసీసీ రోడ్డు పనులకు స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, స్థానిక కార్పొరేటర్ కె. హేమలతతో కలిసి ఫిబ్రవరిలో శంకుస్థాపన చేశారు. మూడు నెలలు కావస్తున్నా పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.



పద్మారావునగర్ పార్కు పక్కన రోడ్డు దుస్థితి

ఆక్రమణలు ఇలా ఎన్నాళ్లు?

అమీర్‌పేటలో ఎటుచూసినా ఆక్రమణలు

అమీర్‌పేట: ఫుట్‌పాత్ ఆక్రమణలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. కాలనీలు, ప్రధాన రహదారులపై రోడ్లకు ఇరువైపులా వెలుస్తున్న ఆక్రమణలతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అక్కడక్కడా అధికారులు ఆక్రమణలను తొలగిస్తున్నా సాయంత్రానికి తిరిగి వెలుస్తున్నాయి. అమీర్‌పేట చౌరస్తా నుండి గ్రీన్ ల్యాండ్ చౌరస్తా, ఎస్ఆర్‌నగర్, బీకేగూడ రోడ్ల పక్కన ఏర్పాటు చేసిన టిఫన్, టీ స్టాళ్లు, కొబ్బరి బొండాల స్టాల్స్ కారణంగా రోడ్లు ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బంది అవుతోంది. అమీర్‌పేట నుండి సనత్‌నగర్‌కు వేసిన వైట్‌ట్యాప్ రోడ్ల పరిసరాలను సైతం వ్యాపారులు వదిలిపెట్టడం లేదు. బల్కంపేట ఆర్ ఆండ్ బీ కార్యాలయం ఎదుట నిర్మాణ సామాగ్రి వ్యాపారులు, ఇసుక, కంకర డంపింగ్ చేసి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు.

కేఎల్‌ఎన్ పార్కు వద్ద..

సనత్‌నగర్ డివిజన్‌లోని కేఎల్‌ఎన్‌వై బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం నుండి కేఎల్‌ఎన్ పార్కుకు వచ్చే రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ రోడ్డును ఆక్రమించుకున్నారు. టిఫిన్ సెంటర్లు, కార్ల మెకానిక్ షెడ్లు, సెకెండ్ సేల్స్ కార్ల షెడ్స్‌ను ఏర్పాటు చేసి అక్కడికి వచ్చే కార్లను రోడ్లుపైనే నిలుపుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారు. పాదచారులు కనీసం నడిచేందుకు కూడా దారి ఉండటం లేదు. అధికారులు చొరవచూపి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



కేఎల్‌ఎన్‌వై పార్కు పరిసరాల్లో రోడ్లపై నిలిపిన వాహనాలు